
కథ



# బర్రె

పాలగుమ్మి రామకృష్ణారావు

బర్రె తప్పిపోయింది. యాదగిరికి తెలిసేటప్పటికి చీకటిపడేవేళయింది. ఎప్పటిలాగే ఉదయం పది గంటలకు నాయక్ వచ్చి బర్రెల్ని మైదానానికి తోలుకుపోయాడు. సాయంత్రం ఐదింటికి ఎప్పట్లాగే తిరిగొచ్చాయి. యాదగిరి చేసిన తప్పేంటంటే అవి తిరిగొచ్చిన వెంటనే వాటినన్నిటినీ చూసుకోకపోవడం. యథాలాపంగా వచ్చేస్తాయన్న ధైర్యంతో షెడ్డు శుభ్రం చేసుకుంటూ కూర్చున్నాడు. నీళ్ళ తొట్టెల్లో నీళ్ళు నింపి, మేత తొట్టెల్లో పచ్చగడ్డి మోపుల్ని విప్పి, గోలాల్లో ఉలవలు, చిట్టు, తవుడు వేసి తిరిగొచ్చిన బర్రెల్ని ఒక్కొక్కదాన్నే గుంజలకు కట్టుకుంటూపోతే ఆఖరి గుంజ మిగిలిపోయినప్పుడు యాదగిరి గుండెలు కొట్టుకుంటున్నాయి. ఒక్కసారి అన్నిటి మొహాల్ని పరికించి చూశాడు.

మొహం మీద తెల్లని మచ్చ, తోట చివర తెల్లని కుచ్చు, చక్రాల్లాంటి నల్లని కళ్ళతో అందంగా వుండే గౌడు గేదె తప్పిపోయింది.

'ఓరి నాయనోయ్. నర్సిరెడ్డికి తెలిస్తే ఇంకేమయినా ఉన్నదా! పూటకు పదిలీటర్ల పాలిచ్చే గేదె తప్పిపోయిందంటే శివాలెత్తుతాడు'.

నర్సిరెడ్డికి ఆ బర్రె అంటే చాలా ఇష్టం. పొద్దుట లేవగానే కానుగ పుల్లతో మొహం కడుగుతూ దాని దగ్గరే నిలబడి మెడ రాస్తూ ఉంటాడు. ఆయాలప్పుడే యాదగిరి దాని పొదుగు దగ్గర బక్కెట్టు పెట్టి పాలుతియ్యాల. పొదుగు కింద బక్కెట్లు మారుతుంటే ఆనందంగా చూసుకునేవాడు నర్సిరెడ్డి. రాత్రిపూట ఎంత పొద్దుపోయినా సరే ఆపక్కకు ఒంటేలుకు పోయేటప్పుడు దాని నుదురుమీద ఆప్యాయంగా చెయ్యేసి ''యూరియా గడ్డేసినావా? ఉలవ పెట్టినావా?'' అంటూ కుశలాలు అడిగేవాడు. జవాబు చెప్పేందుకు ఎప్పుడూ యాదగిరి అక్కడే గడ్డిపక్కమీదుంటాడు.

యాదగిరికి ఏం చెయ్యాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితి ఇంతకుముందు రాలేదు. షెడ్లోంచి బయటకొచ్చి నర్సిరెడ్డి ఇంట్లోకి తొంగి చూశాడు. అర్ధగంటయినా మనిషి జాడలేదు. ఆలస్యం అయినకొద్దీ భయం పెరుగుతోంది. చివరకు లక్ష్మమ్మ గుమ్మంలో కనబడింది. ''అమ్మా'' అంటూ అరిచాడు ఒక్కసారిగా.

''ఏందిరా యాది?'' అంది లక్ష్మమ్మ బయటకొచ్చి.

చమట్లు కారుకుంటూ చెప్పాడు ''బర్రె తప్పిపోయిందమ్మా''

''ఎట్టా! ఏది?''

''మొగం మీద తెల్లమచ్చది. తోకమీద తెల్లకుచ్చుంటది గదమ్మా.''

''ఒంగోలు నుంచి తోలుకొచ్చినాం. గౌడు బర్రేనా?''

''అదేనమ్మా. మేతకెళ్ళి తిరిగి రాలే''.

''మేతకు తోలుకెళ్ళిన ఆ గాడిద కొడుకుని అడగలా?''

''లేదమ్మా. ఆడెల్లినాక బర్రెల్ని గుంజలకు కట్టేస్తూ చూసినానమ్మా''.

''మరిక్కడే నిలబడ్డావేం! ఆడెక్కడున్నాడో పట్టుకో. పోయెత్తుకురా.''

''పాలు తియ్యాల గదమ్మా''

''పోరా సచ్చినోడా. ఆ పెద్దాయనొచ్చేలోగా తోలుకురా. లేకుంటే నీ తోలు వలుస్తాడు. పాల సంగతి నే చూస్తాలే'' అంది లక్ష్మమ్మ మరింత కంగారుతో.

''గట్లనే అమ్మా'' అంటూ యాదగిరి అడుగు వేశాడు. ఆ ఊర్లో బర్రెల్ని మేపే నాయక్ ఊరు చివర తండాలో ఉంటాడు. యాదగిరి ఉరుక్కుంటూ తండా దగ్గరకు వెళ్ళాడు. నాయక్ తండా మనుషులతో కల్లు పట్టులో ఉన్నాడు. యాదగిరి రొప్పుతూ నాయక్ ముందు నిలబడ్డాడు.

''ఏంది యాదగిరి గిట్లొచ్చినావు?'' కల్లు నిషా నాయక్‌కు ఇంకా పూర్తిగా ఎక్కలేదు.

''గదే నాయకు. తెల్లమచ్చ బర్రె తిరిగి రాలే''

''గెందుకు రాలే? నేనాడ్నే వదిల్నా. పక్కోళ్ళ షెడ్లోకి పోయినాదేమో చూసినావా?'' తన తప్పేం లేదన్నట్లు రెండు ముక్కల్లో చెప్పి కల్లు పట్టులో మునిగిపోయాడు. యాదగిరి బిక్కమొగం వేశాడు.

'ఔను, పక్క షెడ్లో చూడ్లే' అనుకుంటూ ఎంత వేగంగా వచ్చాడు అంత వేగంగా వెనక్కు పరుగెట్టాడు.

ముందుగా లక్ష్మమ్మకు చెప్పాలని ఇంటికొచ్చాడు. ఆమె అప్పుడే మరో ఇద్దరు పాలెగాండ్లతో పాలు తీయిస్తున్నది. షెడ్డు దగ్గరకెళ్ళి దమ్ము అడ్డొస్తున్నా విషయం చెప్పాడు.

''నీయవ్వ. నాకేంటి చెప్పేదిరా. పోయి ఎతుకులాడు. యాభైవేల రూపాయల బర్రె. రెడ్డొచ్చే టైంకి బర్రె లేకపోతే నీ పానాలే పోతైరా. ఉరుకు'' అంది లక్ష్మమ్మ.



యాదగిరి మరో మాట లేకుండా కదిలాడు. ఊర్లో ఉన్న నాలుగు షెడ్లు తిరిగాడు. బర్రె లేదు. పంచాయతీ బందెల దొడ్డికి పోయి చూశాడు. బర్రె లేదు. 'కుల్లాగుంది' అనుకున్నాడు నీరసంగా. 'ఊరు దాటిపోయిందేమో! దొంగలు తోలుకుపోయిండ్రేమో! లక్ష్మమ్మ బర్రె లేకుండా రావద్దంది. ఇప్పుడేంది చేసేది?' యాదగిరి తల పట్టుకున్నాడు.

''పక్కూరు పోతే దొరుకుతుందేమో?'' యాదగిరి ఎప్పుడూ ఊరు దాటి పోలేదు. ఈ చిన్ని ఊర్లోనే ఒక పశువుల కొట్టంలో పుట్టాడు. మరో పశువుల కొట్టంలో పెరుగుతున్నాడు. అమ్మ ఒడిలో ఆడినట్లు గుర్తులేదు. కానీ బర్రెల కాళ్ళ మధ్య పాకడం గుర్తుంది. కోడెదూడ వెంట పరుగులెట్టడం గుర్తున్నాయి. షెడ్లో కసువూడ్చడం, పేడకళ్ళను తీసి పిడకలెయ్యడం, బర్రెలకు నీళ్ళు, మేత పెట్టడం, వీటితోనే పొద్దుగూకేది. ఊహ తెలిసినప్పటినుంచి నర్సిరెడ్డి షెడ్లోనే పని చేస్తున్నాడు. తానా షెడ్లోకి వచ్చినాక వచ్చిన బర్రెలు అన్నీ పిల్లల తల్లులయినాయి. యాదగిరికి వాటన్నిటి మీద అమితమైన ప్రేమ. అవి ఆకలైతే అరిచే అరుపు యాదగిరికి బాగా తెలుసు. వెంటనే లేచి గంపనిండా గడ్డి నింపేవాడు. వాటిని గుంజలకు కట్టేటప్పుడు, పాలు తీసేటప్పుడు టిర్ర్– టిర్ర్ – దా.. దా... అంటూ తన భాషలో ఆప్యాయంగా పలకరించేవాడు. అవి అర్థం చేసుకుని వాడున్నచోటికొచ్చి ఆగేవి. పాలు పితికేటప్పుడు వాడికి శేర్లకొద్దీ పాలిచ్చేవి. అన్ని బర్రెలకు యాదగిరి ఒక్కడే పాలు తియ్యాలి. వాడికేదైనా అనారోగ్యం చేస్తేనే లక్ష్మమ్మ వేరేవాళ్ళచేత పాలు తీయించేది. ఆరోజు పాల వ్యాపారం వెనకబడేది. ఖాతాలకే సరిపోయేది కాదు.

యాదగిరి ఎప్పుడూ ఊరు దాటి పోలేదు. ఈ చిన్ని ఊర్లోనే ఒక పశువుల కొట్టంలో పుట్టాడు. మరో పశువుల కొట్టంలో పెరుగుతున్నాడు. అమ్మ ఒడిలో ఆడినట్లు గుర్తులేదు. కానీ బర్రెల కాళ్ళ మధ్య పాకడం గుర్తుంది. కోడెదూడ వెంట పరుగులెట్టడం గుర్తున్నాయి. షెడ్లో కసువూడ్చడం, పేడకళ్ళను తీసి పిడకలెయ్యడం, బర్రెలకు నీళ్ళు, మేత పెట్టడం, వీటితోనే పొద్దుగూకేది. ఊహ తెలిసినపటి నుంచి నర్సిరెడ్డి షెడ్లోనే పని చేస్తున్నాడు. తానా షెడ్లోకి వచ్చినాక వచ్చిన బర్రెలు అన్నీ పిల్లల తల్లులయినాయి. యాదగిరికి వాటన్నిటి మీద అమితమైన ప్రేమ. అవి ఆకలైతే అరిచే అరుపు యాదగిరికి బాగా తెలుసు.

యాదగిరికి ఈ తప్పిపోయిన తెల్లమచ్చ బర్రంటే చాలా ఇష్టం. నర్సిరెడ్డి ఆ బర్రెను చాలా ఇష్టంగా తెచ్చుకున్నాడు కాబట్టే యాదగిరి కూడా దాన్ని తన ప్రాణంలాగే చూసుకున్నాడు. అది చిన్న తల, పెద్ద శరీరంతో నిగనిగలాడిపోయేది. దానికి ఎంత కోపం ఉండి బుసలు కొట్టినా యాదగిరి దగ్గర తలొంచేది. దాని పొదుగు మహత్యమో లేక యాదగిరి చెయ్యి మహత్యమో కానీ ఎన్ని పాలు పిండినా ఇంకా చేదుకొచ్చేవి. నర్సిరెడ్డి ముందుజాగ్రత్తగా దానిమెడలో దిష్టిగవ్వలు కట్టాడు. ఉన్న బర్రెల్లో అది ఠీవిగా, రాజులా ఉండేది. అట్లాంటిది అదెలా తప్పిపోయింది.

యాదగిరి చీకటి మాటున చేల గట్లంట వెతికాడు. ''దీనవ్వ చీకటి, మన బర్రె రంగులో కలిసిపోయి అడ్డొస్తున్నది'' అంటూ చీకటినే తిట్టుకున్నాడు. రాళ్ళు, ముళ్ళు లెక్కచేయకుండా పరుగులాంటి నడకతో గట్లెంబడ తిరిగాడు. మధ్యమధ్యలో చీకట్లో బాణంలా 'టిర్ర్... టిర్ర్' అని అరుచుకుంటూ పొలాల మధ్యనుంచి పోయే రైలుకట్ట వరకు వచ్చాడు. అక్కడకు కొద్ది దూరంలోనే స్టేషనుంది.

నర్సిరెడ్డిని రైలెక్కించడానికి బట్టల పెట్టె మోస్తూ తను చాలాసార్లు స్టేషను దగ్గరకెళ్ళాడు. నాలుగైదు గ్రామాలకు కలిసి ఆ ఊళ్ళో ఆ చిన్న స్టేషను వెలిసింది. రోజూ రెండు




పాసింజర్లు ఆగుతాయి. పెద్ద రైళ్ళు మాత్రం ధనధన మంటూ గంటలకోసారి పోతాయి.

స్టేషన్‌లో రైలాగి ఉంది. యాదగిరి పట్టాలెంబడి వెతుకులాటతో స్టేషన్‌కు చేరాడు. బఱ్ఱె కూడా పట్టాల వెంబడి పోయిందేమో! ఊరి పొలిమేర వరకు బఱ్ఱె కానరాలేదు.

అప్పుడే ఒక పెద్ద రైలు దుమ్ము రేపుకుంటూ మరోపక్కకు వెళ్ళిపోయింది. కొన్ని క్షణాలకి పాసింజరు కూతేసింది. ''ఈ రైలెక్కి దారంబడ వెతికితే ఎట్లుంటది?'' అనుకున్నాడు యాదగిరి. రైలు కదిలింది. అనాలోచితంగా పెట్టెలోకెక్కేశాడు. రైలు చుక్ చుక్‌మంటూ కొంచెం వేగం పెంచుకుంది. యాదగిరి గుమ్మం దగ్గర కూర్చున్నాడు. క్షణం ఖాళీ లేకుండా రెండు పక్కలకు తల తిప్పుతూ చూస్తున్నాడు బఱ్ఱె కోసం. కళ్ళు పత్తికాయల్లా పొంగినా బఱ్ఱె మాత్రం కనపడడం లేదు.

ఒక గంటకు రైలు మరో స్టేషనులో ఆగింది. యాదగిరి జీవచ్ఛవంలా రైలు తలుపునకు అతుక్కుపోయాడు. టికెట్ కలెక్టర్ బోగీ మారుతూ గుమ్మం దగ్గరున్న యాదగిరిని కాలుతో ఒక తన్ను తన్ని 'దిగరా – దిగు' అని గదమాయించాడు. గోచీగా చిన్న తుండు, చిరుగుల చొక్కా, చింపిరి జుట్టుతో యాదగిరి బిచ్చగాడిలాగే ఉన్నాడు. ఇలాంటివాడు టిక్కెట్టు కొనడని టి.సి.కి తెలుసు. అందుకే నిర్లక్ష్యంగా తన్నాడు.

యాదగిరి రెండు చేతులెత్తి 'నీ బాంచను కాల్మొక్తా దొరా. బఱ్ఱె పోనాదయ్యా' అన్నాడు దండంపెట్టి దిగుతూ. టి.సి. బండి కదిలేముందు పక్క బోగీలోకి వెళ్ళిపోయాడు. యాదగిరి భయంతో కిందే ఉండిపోయాడు.

అప్పుడు టైం ఎంతయిందో యాదగిరికి తెలీదు. బాగా పొద్దుపోయిందని మాత్రం తెలుసు. బఱ్ఱెల పాలు తీసే టైం ఎప్పుడో అయిపోయింది. లక్ష్మమ్మ తనకు అన్నం పెట్టే వేళ అయిపోయింది. నర్సిరెడ్డి బఱ్ఱెను పలకరించే పొద్దూ అయిపోయింది.

''ఇంటి దగ్గర ఏంజరుగుతోందో!'' నర్సిరెడ్డి పలుపుతాడు పట్టుకున్నట్టు కనపడుతోంది. లక్ష్మమ్మ బఱ్ఱెల షెడ్డులోంచి తనను బయటకు గెంటి తాళంవేసుకుని లోపలికి వెళ్ళిపోయినట్టు కనబడుతోంది.

''దేవుడా నాకిదేంటి శిక్ష! నేనేం అన్యాయం చేశాను? రేపట్నించి నేనెలా బతకాలి? తప్పిపోయిన ఆ బఱ్ఱె నాలాంటిదే. అదెలా బతుకుద్దో! రోజా గంపెడు పచ్చగడ్డి కావాలి దానికి. శేరు ఉలవలు తింటాది. నాలుగు డబ్బాలు చిట్టు, తవుడు కావాలి. యూరియా గడ్డి మేతకు ఆపులేదు. అలాంటిది కడుపు మాడ్చుకుని ఈ రాత్రేల ఏడ తిరుగుతోందో!'' యాదగిరి దాని జ్ఞాపకాలతో బెంచిమీద కూలబడ్డాడు.

''అది ఆకలేసినప్పుడల్లా అంబా – అంబా అని తెగ అరిచేది. ఇప్పుడు ఎంత వెతుకులాడుతున్నా దాని అరుపే కాదు! ఈ ఊర్లాగానే ఉందేమో? వెతికితే పోలా?'' యాదగిరి లేచి స్టేషన్ బయటికొచ్చాడు.

''షిర్... టిర్... దా...దా'' అంటూ అరుస్తూ ఊరంతా తిరిగాడు. రాత్రి పన్నెండు దాటింది. ఊర్లో ఉన్న టూరింగ్ టాకీసు సినిమా వదిలిన గుర్తుగా గరగరలాడుతూ మైకు గొట్టంలోంచి పాటొచ్చింది. ఆ పాటలాగే జనం గలగల మాట్లాడుకుంటూ, చెమట వాసన కక్కుకుంటూ రోడ్డెక్కుతున్నారు. ఆ జనం వెళ్ళిపోతే రోడ్డంతా ఖాళీ అయి ఆరోజుకి ఊరు పూర్తి నిశ్శబ్దంలోకి వెళ్ళిపోతుంది.

యాదగిరి 'టిర్ర్.. టిర్ర్' అంటూ దిక్కులు చూస్తున్నాడు. జనం వాడ్ని వింతగా చూసి వెళ్ళిపోతున్నారు. మరుక్షణానికి డబడబ శబ్దం చేసుకుంటూ మోటారు సైకిలు యాదగిరి ముందాగింది.

''ఏంట్రా యాదగిరి! ఈడున్నావేంటి?'' అన్నాడు కేతురెడ్డి బండి దిగకుండానే. కేతురెడ్డి, నర్సిరెడ్డికి బావమరిది.

''అయ్యా దండాలు బాబు. మన బఱ్ఱె, తప్పిపోనాదండి. ఎతుకులాడుతున్నానండి.''

''ఇంతదూరం ఎట్లొస్తాది? అసలు నువ్వెట్లొచ్చావు?''

''మనూర్ల రైలాగిందయ్యా. అదెక్కినా.''

''రైలెక్కినావా? మళ్ళీ ఎనక్కెట్లొస్తావు?''

''తెలీదయ్యా. బఱ్ఱె కనపడగానే, నేను బఱ్ఱె రైలెక్కేస్తామయ్యా''

''నీయవ్వ బఱ్ఱె రైల్లో పడతాదిరా? రేపటి వరకు రైళ్ళు లేవుగానీ నా బండెక్కు ఇంటికిపోదాం''

''బఱ్ఱె లేకుండా ఎలాగయ్యా...''

''ఇలాగే తిరిగితే నువ్వు కూడా కనపడవు. రేప్పొద్దుటేల ఎతుకులాడుదువుగాని పద. సూత్తావేంద్రా – ఎక్కు. ఇటోకాలు, అటోకాలు ఏస్కో. బండెక్కడం కూడా రాదు''

యాదగిరి భయంభయంగా మోటారు సైకిలెక్కి కేతురెడ్డికి అంటకుండా పొందిగ్గా కూర్చున్నాడు.

''అసలు రైలెట్లెక్కినావురా? టిక్కట్టు కొన్నావా? టి.సిగాడు తోసెయ్యలేదా? రైల్లో మద్రాస వరకు పోతే ఏం చేద్దువురా? నేను అగపడ్లేదనుకో, నీ పని రాత్రికేంట్రా. దారి తెలీక, ఇల్లు తెలీక పిచ్చోడివైపోతావురా!'' దారి పొడుగునా కేతురెడ్డి వేసే ప్రశ్నలకు 'అయ్యా... అయ్యా' అని మాత్రమే జవాబు చెప్పాడు.

మోటారు సైకిలు అరగంటలో సొంత ఊరొచ్చింది. యాదగిరికి గుండెలు అదరడం మొదలుపెట్టాయి. మరో నిముషానికి బండి ఇంటిముందు ఆగింది. గుండె దడ మరింత వేగం అయింది.

''బండి దిగరా'' గర్జించాడు కేతురెడ్డి.

యాదగిరి ఒక్క ఉదుటున కిందకు దిగాడు. కేతురెడ్డి ఒకసారి హారన్ కొట్టి, ఇంజను ఆపుచేసి స్టాండ్ వేశాడు.

యాదగిరి, కేతురెడ్డి వెనకనే అడుగులు వేశాడు, కబేళాకు వెళ్ళే గొర్రెలా. ఇంటి తలుపులు తెరుచుకున్నాయి. నర్సిరెడ్డి, వెనకనే లక్ష్మమ్మ బయటకొచ్చారు.

నర్సిరెడ్డి చేతులవైపు చూశాడు యాదగిరి, ఆ చేతుల్లో పలుపుతాడు తప్పకుండా ఉంటుందని, తన తోలు తియ్యడం ఖాయమని అనుకుంటూ. వాడూహించినట్లుగా నర్సిరెడ్డి చేతిలో పలుపుతాడు లేదు. నోట్లో చుట్ట పెట్టి, అగ్గిపుల్ల వెలిగిస్తూ వచ్చాడు.

''ఏంటి బావా, ఈ ఎర్రోడ్ని బఱ్ఱె వెతకమని పంపించావా? పక్కూర్లో నా కంటపడ్డాడు కనక సరిపోయింది. లేకపోతే ఈడూ తప్పిపోయేవాడే.''

''ఎవడు పంపించాడు? నేను చెప్పలేదే''

''నేనే ఊర్ల చూసి రమ్మన్నాను. పక్కూరుకు పొమ్మన్లే'' అంది లక్ష్మమ్మ.

యాదగిరి గజగజ వణికే రెండు చేతుల్ని కట్టేసుకుని, తలొంచుకుని అతికష్టం మీద చెప్పాడు ''అయ్యా బఱ్ఱె కనపడలే''.

నర్సిరెడ్డి గట్టిగా నవ్వితే నోట్లోంచి చుట్టపొగ గభీన విరజిమ్మింది. యాదగిరికి చమట్లు కారినాయి.

''ఏంది బావా. రేపెతకాల్నా?''

''బఱ్ఱె తిరిగొచ్చినాదికానీ నువ్వు పోయి అన్నం తిను. ఏంటే లక్ష్మమ్మా ఈడు కూడు తిన్నాడా?'' అన్నాడు యాదగిరిని చూస్తూ.

యాదగిరికి వణుకు తగ్గింది.. గుండె మామూలు స్థితికొచ్చింది. చమట్లు ఆరిపోయాయి. ''బఱ్ఱె వచ్చేసిందా!'' అంటూ ఆనందంగా షెడ్డుకేసి పరిగెట్టాడు. ★